క్లుప్తంగా

ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయం



మాట్లాడుతున్న ఉద్యమకారులు

నేరడిగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయమని ఉద్యమకారులు కుడాల స్వామి, గజ్జల శంకర్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని, రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రిగా పది సంవత్సరాలు ఉన్న కేసీఆర్ ఒక్కరోజు కూడా తెలంగాణ ఉద్యమకారులను, అమరులై వారి గురించి మాట్లాడకపోవడం బాధకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి వారిని ఆదుకోవాలని మొదలు పెట్టిన ప్రక్రియ పట్ల ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. సారంగ రవి, సంగేపు శంకర్, గజ్జల అశోక్, నలిగంటి ఊషన్న, షేక్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన డీసీసీబీ డైరెక్టర్లు



సీతక్కను సన్మానిస్తున్న డైరెక్టర్లు

ఎదులాపురం: ప్రజాపాలనలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి సీతక్కను డీసీసీబీ డైరెక్టర్లు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, దుర్గం రాజేశ్వర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఇదిలా ఉండగా జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని డైరెక్టర్‌లకు మంత్రి సూచించారు.

అక్షింతల శోభాయాత్ర

బజార్‌హత్నూర్: అయోధ్య రామమందిరంలోని శ్రీరాముని విగ్రహం ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమానికి తీసుకువెళ్ళే అక్షింతల కలశంను గురువారం భజరంగ్ దళ్ నాయకులు మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తు ఫారాలు ప్రభుత్వమే సరఫరా చేయాలి



ప్రజలతో మాట్లాడుతున్న దర్శనాల మల్లేశ్

ఎదులాపురం: ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్నతో కలిసి జిల్లా కేంద్రంలోని విద్యానగర్, రణదివేనగర్ కాలనీల ప్రజాపాలన సెంటర్‌లను ఆయన సందర్శించారు. రణదివేనగర్‌లో కేవలం 50 దరఖాస్తులు మాత్రమే అధికారులు పంపిణీ చేశారని, దాదాపు 200 మంది ఉండడంతో రూ. 20 చెల్లించి జిరాక్స్‌లు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మెప్మా ఉద్యోగులకు కనీస వసతులు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దరఖాస్తులు పంపిణి చేయాలని, సిబ్బందికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీకాళహస్తి ఈశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ఆలయం వద్ద ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మహాశివుని ఆలయం శ్రీకాళహస్తి శివగంగా ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. గురువారం కుటుంబ సమేతమంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అందరు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు

కడెం: మండల కేంద్రంలో గురువారం సీపీఐ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భుక్యా రమేశ్ పార్టీ జెండా ఎగురవేసి మాట్లాడారు. దేశంలో సమసమాజ స్థాపన, స్వాతంత్ర్య సాధనే లక్ష్యంతో 1925లో సీపీఐ లక్నోలో ఏర్పడిందన్నారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో



బజార్‌హత్నూర్: మాట్లాడుతున్న తహసీల్దార్ శంకర్



ఇంద్రవెల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



నార్నూర్: మాట్లాడుతున్న ఎంపీడీవో రామేశ్వర్

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ముందుగా ప్రకటించిన గ్రామాల్లో అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరారు. కొన్ని గ్రామాల్లో దరఖాస్తుల కొరత ఏర్పడింది. గుడిహత్నూర్ మండలంలోని మల్కాపూర్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. అలాగే ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవేనగర్, గాంధీనగర్‌లోని దరఖాస్తు కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు.

– సాక్షి, నెట్‌వర్క్



సిరికొండ: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో సురేశ్, అధికారులు



కైలాస్‌నగర్: దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్



గుడిహత్నూర్: పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆదిలాబాద్‌రూరల్: పరిశీలిస్తున్న అధికారులు



బేల: భవానీగూడ(సి)లో..



ఇచ్చోడ: దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు



నేరడిగొండ: కొర్టికల్(బి)లో



తలమడుగు: మాట్లాడుతున్న అధికారులు



తాంసి: వడ్డాడిలో..

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: మండలంలోని రాజుర గ్రామంలో శుక్రవారం నిర్వహించే ప్రజపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొంటారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఎంపీపీ రాథోడ్ సజన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల తీరును పరిశీలిస్తారని పేర్కొన్నారు.

నేడు దరఖాస్తుల స్వీకరణ

నేరడిగొండ: మండలంలోని బందంరేగడి, గుత్పాల, కిష్టాపూర్, యాపల్‌గూడ, రాజుర, ఇస్పూర్ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామపంచాయతీల ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

తలమడుగు: పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని జెడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్ కోరారు. పాఠశాలకు గ్రామానికి చెందిన అల్లూరి సంజీవ్ రావు ప్రింటర్‌ను, అల్లూరి మధుకర్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంప్యూటర్‌ను అందజేశారు. వీటిని గురువారం పాఠశాల చైర్మన్ దాతల చేతుల మీదుగా ప్రారంభించారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది ముందుకు రావాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గంగన్న, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, లలితా రెడ్డి, నగేశ్, రాకేశ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: ఇటీవల మృతి చెందిన ఫొటోగ్రాఫర్ నవీన్ కుమార్ కుటుంబానికి బోథ్ మండల ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 1,50,000 ఆర్థిక సాయం గురువారం అందజేశారు. అనంతరం తమ సంఘం భవనానికి స్థలాన్ని కేటాయించాలని సర్పంచ్ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ సురేందర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరికంటి మహేష్, మండల అధ్యక్షుడు కాడెరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీరాం విజయ్, కోశాధికారి నోముల కుశాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంతర సాగు.. లాభాలు బాగు

- ప్రధాన పంటలతో పాటు ఇతర పంటల సాగు
- పెట్టుబడి తక్కువ.. అధిక ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు రైతులు



పత్తిలో సాగు చేస్తున్న పెసర పంట

గుడిహత్నూర్: పంటల సాగులో అన్నదాతలు నానాటికీ కొత్త ఒరవడిని అందిపుచ్చుకుంటున్నారు. సాధారణంగా జిల్లాలో పత్తి, సోయా, కంది, శనగ వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయ సాగులో మార్పులు చేపడుతూ.. అధిక లాభాలు పొందుతున్నారు.

అంతర పంటలతో మిశ్రమ ఫలితాలు

సాధారణంగా ఎక్కువ మంది రైతులు పత్తి సాగు చేస్తారు. అయితే గత కొన్నేళ్లుగా పత్తిలో అంతర పంటగా కంది సాగు చేస్తున్నారు. ఇదే తరహాలో సోయా ప్రధాన పంట ఉండగా అందులో కూడా కంది సాగు చేస్తున్నారు. దీంతో సోయా పంట చేతికి వచ్చే నాటికి కంది పూత దశలో ఉంటుంది. సోయా చేతికందిన వెంటనే మరికొందరు వెంటనే ఆకు కూరలైన మెంతి, కొత్తిమీ, తోటకూర, పాలకూర సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. సాగు నీటి వసతి ఉన్న రైతులు ఇలా నూతన పద్ధతులు పాటించి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నారు.

నూతన పద్ధతిలో..

మండలంలో ఈఏడాది పలువురు రైతులు కొత్తగా ఆలోచించి సాగులో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మండలంలో మన్నూర్‌కు చెందిన రైతు సాహెబ్‌రావ్ పత్తిలో అంతర పంటగా పెసరను సాగు చేసి మంచి ఫలితాలు సాధించారు. స్వల్పకాలిక పంట అయిన పెసర చేతికందే నాటికి పత్తి పూత కాత దశలో ఉంటుంది. దీంతో పాటు పెసర పంటను తీసివేయగానే పత్తి సాళ్ల మధ్య దూరం బాగా ఉండడంతో పత్తి మొక్కలకు గాలి, ఎండ బాగా తగలడం వల్ల మొక్క దృఢంగా ఎదిగి పూత, కాత ఆశించిన స్థాయిలో వస్తుంది. దీంతో దిగుబడులు పెరిగి రెండు పంటలను ఏక కాలంలో తీసుకోవచ్చు. ఇదే కోవలో మండల కేంద్రానికి చెందిన రైతు సంజీవ్ సిర్సాట్ గత ఏడాది తన నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ప్రారంభించాడు. ఆయిల్‌పామ్ మొక్కల మధ్య సోయా పంట వేస్తున్నాడు. పంట తీసుకున్న తర్వాత ఇటీవల భూమి చదును చేసి మల్చింగ్ విధానంలో పుచ్చకాయ సాగు చేస్తున్నాడు. మల్చింగ్ షీట్లలోనే డ్రిప్ విధానంలో మొక్కలకు నీరందిస్తున్నాడు. దీని వల్ల నీటి వృధాను అరికట్టడంతో పాటు ఏకకాలంలో రెండు పంటలు సాగు చేయవచ్చని నిరూపించాడు. పుచ్చకాయ పంట చేతికందగానే అదే షీట్లపై ఎలాంటి దుక్కి ఖర్చులు, కలుపు లేకుండా పత్తి పంట విత్తుకుంటానని తెలిపాడు. డ్రిప్ విధానంలోనే ఎరువులు మొక్కలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాడు. దీనివల్ల ఎరువులు నేరుగా మొక్కకు అంది మంచి ఫలితాలు సాధించవచ్చు. సాగులో కొత్త ఒరవడిని పాటిస్తున్న రైతులు చాలా వరకు పెట్టుబడి ఖర్చులు తగ్గించి ఏక కాలంలో రెండు నుంచి మూడు పంటలు సాగు చేస్తున్నాడు. ఇలా నూతన పద్ధతులు పాటిస్తున్న రైతులు చూసి మిగతా రైతులు అంతర్ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పెట్టుబడి తగ్గుతుంది



నాకున్న నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ పంటలో ఇదివరకు పత్తి, సోయా సాగు చేశా. ఇప్పుడు మల్చింగ్ విధానంలో పుచ్చకాయ సాగు చేస్తున్నా. వచ్చే ఖరీఫ్‌లో ఎలాంటి ఖర్చులు లేకుండా పుచ్చకాయ స్థానంలో పత్తి విత్తుకుంటా. దీని వల్ల చాలా వరకు పెట్టుబడి తగ్గుతుంది.

– సంజీవ్ సిర్సాట్, రైతు, గుడిహత్నూర్

పత్తిలో పెసర సాగు



వానాకాలయం ప్రారంభంలో పత్తిలో అంతర పంటగా పెసర సాగు చేశా. మొదటిసారిగా కేవలం రెండెకరాల్లో ఈ ప్రయోగం చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. వచ్చే ఏడాది దీని విస్తీర్ణం పెంచుకుంటా. పప్పు దినుసులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– రామ్‌సాహెబ్ ముండే, రైతు, మన్నూర్

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిని వెలిగిస్తున్న అయ్యప్పస్వాములు

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలో గురువారం ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. ఎంపీపీ ఇంటి వద్ద నిర్వహించిన పడిపూజలో గురుస్వామి సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి,సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అయ్యప్పకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పద్దెనిమిది మెట్లపై పడిని వెలిగించారు. కార్యక్రమంలో గురుస్వాములు పొచ్చారెడ్డి, నరేశ్, అరుణ్, సతీష్, రాజన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల విట్టల రుక్మాబాయి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మేంద్రస్వామి కల్యాణం

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలో గురువారం బ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణానికి బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ధన్‌రాజ్ హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు ధనుంజయ్ రెడ్డి, వసంత్, రజనీకాంత్ రెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

‘కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి’

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోకస్మన్నూర్ సర్పంచ్ బత్తుల గంగారాం అన్నారు. గురువారం మండలంలోని కోకస్మన్నూర్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గ్రామస్తులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ప్రచారం రథం ద్వారా గ్రామంలో కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాముల మోతిరాం, ఏఎన్‌ఎంలు తులిసి, అహల్య, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: ఇటీవల మావల మండల పరిధిలో మాల సామాజిక వర్గానికి చెందిన ఎంబడి వంశీపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి ఏ1, ఏ2 నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత ఐక్యవేదిక నాయకులు అల్లూరి భూమన్న, బ్రహ్మ శ్రీనివాస్, క్రాంతికుమార్, రత్నజాడే ప్రజ్ఞా కుమార్ ఎస్పీని కోరారు. ఈ విషయమై గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన నిందితుడైన రఘుపతి, అరుంధతిలను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

‘పీఎఫ్‌ఆర్‌డీఏ బిల్లు రద్దు చేయాలి’



నిరసన తెలుపుతున్న టీఎన్‌జీవో నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పీఎఫ్‌ఆర్‌డీఏ బిల్లును దేశ వ్యాప్తంగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. గురువారం కోల్‌కత్తాలో అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధానిలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే సమావేశాలకు టీఎన్‌జీవో జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ పరిమితి పెంపు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘సమావేశాల్లో పాల్గొనడం సరికాదు’



మాట్లాడుతున్న విజ్జగిరి నారాయణ

ఎదులాపురం: ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఏ హోదాలో పాల్గొన్నారని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పాల్గొన్న అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనడం సరికాదన్నారు. జైనథ్ మండలం జామినిలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారని మండిపడ్డారు. సమావేశంలో జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, గంగ్రత్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నాగ్‌పూర్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

నేరడిగొండ: జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా నాయకులు నాగ్‌పూర్‌కు తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు వాహనాలు, బస్సుల్లో తరలివెళ్లారు. ఇందులో బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి, నేరడిగొండ మండల ప్రెసిడెంట్ ఆడే వసంత్, వైస్ ప్రెసిడెంట్ కపిల్ దేవ్, వకీల్, సంజీవ్, బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

బోథ్: మహారాష్ట్రలోని నాగాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ 139వ ఆవిర్భావ సభకు బోథ్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. బోథ్, ధన్నూర్, సొనాలతో వివిధ గ్రామాల నుంచి నాగాపూర్‌కు తరలివెళ్లారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ నాయకులు బూర్గుల మల్లేష్, సిరిసే సంజీవ్, చంటి, మహేందర్, అబూద్, తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభ విజయవంతం చేయండి

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఇచ్చోడ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి కోరారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, జిల్లా అధ్యక్షుడు జోగురా మన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గొడం నగేశ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న నాయకులు

బోథ్: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సల్ల రవి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్, నాజిర్ అహ్మద్, వినయ్ రెడ్డి, అబ్రార్, అరుణ్ రెడ్డి, యూసుఫ్, రాయల్, తిరుపతి పాల్గొన్నారు.